సాక్షి కర్నూలు

ఆదివారం । 10 । సెప్టెంబర్ । 2023



కేసీకి 1,394 క్యూసెక్కుల నీరు

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కెనాల్‌కు 1,394 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్‌కు ఎగువ ప్రాంతాల నుంచి 1,810 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



యోగాతో ఆరోగ్యభాగ్యం

కర్నూలులో శనివారం రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్, సీనియర్ యోగా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో 11 జిల్లాల నుంచి 500 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు.

IIలో



11వ రోజు 397 మంది ఎంపిక

ఎస్‌ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలను పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ అతుల్ సింగ్ పరిశీలించారు. 11వ రోజు 397 మంది తుది రాత పరీక్షకు అర్హత సాధించారు.

IIలో

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో రేపు స్పందన

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా ఈ సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం కొనసాగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీ మఠంలో హైకోర్టు జడ్జి సుజాత



జస్టిస్ సుజాతకు స్వాగతం పలుకుతున్న ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

మంత్రాలయం: ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ సుజాత శనివారం మంత్రాలయం చేరుకున్నారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పీఠాధిపతి శ్రీ సుభుదేంద్ర తీర్థులు ఫల, పుష్ప, మంత్రాక్షితలిచ్చి ఆశీర్వదించారు. అంతకు ముందు వీరికి ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ బొకే అందజేసి స్వాగతం పలికారు. వీరితో పాటు ఎమ్మిగనూరు జడ్జి గురుఅరవింద్, తహసీల్దార్ చంద్రశేఖర్, సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు ఉన్నారు.

పటాలం సిబ్బందికి దర్బార్



దర్బార్‌లో సమస్యలు తెలుసుకుంటున్న అడిషనల్ డీజీ అతుల్‌సింగ్

కర్నూలు: ఏపీఎస్పీ కర్నూలు రెండో బెటాలియన్‌లో శనివారం పటాలం సిబ్బందికి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్, అడిషనల్ డీజీ అతుల్‌సింగ్ దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్స్ డీఐజీ సిహెచ్ వెంకటేశ్వర్లు, కమాండెంట్ రవిశంకర్ అడిషన్ డీజీకి స్వాగతం పలికారు. అనంతరం పటాలం ప్రధాన కార్యాలయాన్ని అతుల్‌సింగ్ సందర్శించి మినిస్టీరియల్ స్టాఫ్‌ను కలసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దర్బార్‌లో సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పటాలం పరిపాలన విభాగం, యూనిట్ మెడికల్ హాస్పిటల్, మినరల్ వాటర్ ప్లాంట్, యూనిట్ క్యాంటీన్, బెటాలియన్ వెల్ఫేర్ ఆఫీస్, క్వార్టర్ మాస్టర్ గ్రూప్, ఎస్‌పీఎస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, కళ్యాణ మండపం తదితర వాటిని తనిఖీ చేసి తగు సూచనలు చేశారు. ఇన్‌చార్జి అడిషనల్ కమాండెంట్ రవికిరణ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, మినిస్టీరియల్ స్టాఫ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శిక్ష అనుభవించాల్సిందే



దేవుడు ఉన్నాడు. అన్ని చూస్తుంటాడు. తప్పు చేస్తే చూస్తూ ఊరుకోడు. తప్పు చేసిన వారు శిక్ష అనుభవించక తప్పదు. నీతి పరుడని, నిప్పునని చెప్పుకుంటూ స్కిల్ డెవలప్‌మెంట్‌లో రూ.371 కోట్ల ప్రజాధనాన్ని స్వాహా చేసిన చంద్రబాబు జైలు జీవితం గడపాల్సిందే. చంద్రబాబు అవినీతి ముందే తెలిసిన టీడీపీ నాయకులు పెద్దగా స్పందించడం లేదు. నంద్యాలలో అరెస్ట్ జరిగితే ఒక్క టీడీపీ కార్యకర్త కూడా రోడ్డుపైకి రాలేదు.

– శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్యే, నంద్యాల

చంద్రబాబు జీవితమంతా స్కాములే



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన 14 ఏళ్ల హయాంలో రూ. లక్షల కోట్ల స్కామ్‌లకు పాల్పడ్డారు. చంద్రబాబు అవినీతి బయట పడినా కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకొని తాను నిప్పునని బయట చెప్పుకుంటారు. చంద్రబాబు ఎంత వరకు నిప్పో స్కిల్ డెవలప్‌మెంట్‌లో బయట పడిన అవినీతే నిదర్శనం. చంద్రబాబు చేసిన పాపాలు బయటపడుతున్నాయి.

– కాటసాని రామిరెడ్డి, ఎమ్మెల్యే, బనగానపల్లె

అడ్డంగా దొరికిపోయాడు



ఇప్పటి వరకు ఎన్నో కోట్ల స్కామ్‌లకు పాల్పడి తప్పించుకున్న చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అడ్డంగా దొరికిపోయాడు. జీఎస్టీ, ఈడీ, ఇంటలిజెన్స్, ఐటీ, సెబీ ఇలా ఏజెన్సీలన్నీ పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి స్కామ్‌ను ధ్రువీకరించాయి. చట్టం నుంచి చంద్రబాబు తప్పించుకోలేడు. జైలు జీవితం గడపాల్సిందే.

– ఎర్రబోతుల పాపిరెడ్డి, జెడ్పీచైర్మన్

తప్పు చేయడంతోనే అరెస్టు

తనను అరెస్టు చేస్తే ప్రజాగ్రహం పెల్లుబుకుతుందని ఆశించిన చంద్రబాబుకు నిరాశే మిగిలింది. తన పార్టీ నేతలు హంగామా చేస్తారని ఆశిస్తే తప్పు చేసినందుకే అరెస్టు చేసింటారనే ధోరణి చాలా మందిలో కనిపించింది. ఎక్కడ కూడా ఐదు, పది నిముషాలు కూడా నేతలు నిరసన చేసిన దాఖలాల్లేవు. తనను అరెస్టు చేస్తారేమోనని చంద్రబాబు ముందుగానే చెప్పినా, ఆ పార్టీ నేతలు పెద్దగా స్పందించకపోవడం అరెస్టును అంగీకరించినట్లయింది. కొద్ది మంది నేతలు ఫొటోలకు ఫోజులు ఇవ్వడం, అక్కడక్కడ రాస్తారోకోలతో ప్రజలు ఇబ్బందులు పడటం మినహాయిస్తే.. అందరూ అరెస్టును స్వాగతించడం గమనార్హం.

ఉనికి చాటుకునేందుకు టీడీపీ పాట్లు

- రోడ్డుపై ఫొటోలకు ఫోజులతో సరి
- ఎక్కడా ఐదు నిముషాలకు మించని ఆందోళన
- పలు ప్రాంతాల్లో బయటకు రాని నేతలు
- బనగానపల్లెలో తూతూమంత్రంగా మాజీ ఎమ్మెల్యే నిరసన
- అక్కడక్కడ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు
- ముందస్తుగా ఆర్టీసీ బస్సులు నిలిపివేత



డోన్‌లో టీడీపీ నేతలు బంద్‌కు పిలుపునిచ్చినా పాతపేట పెద్ద బజార్‌లో యథావిధిగా వ్యాపారాలు

కర్నూలు(అర్బన్)/సెంట్రల్: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో టీడీపీ అధినేత చంద్రబాబును ఏపీ సీఐడీ పోలీసులు అరెస్ట్ చేయడం పట్ల ఉమ్మడి కర్నూలు జిల్లాలోని తెలుగుదేశం పార్టీ నేతల్లో స్పందన కరువైంది. తప్పు చేసిన వారికి శిక్ష తప్పదనే ధోరణితో మెజారిటీ నేతలు ఎవరి సొంత పనుల్లో వాళ్లు నిమగ్నమయ్యారు. మరికొందరు నేతలు తమ ఉనికి చాటుకునేందుకు ఆరాటపడ్డారే తప్ప తమ పార్టీ అధినేత చంద్రబాబుపై ప్రేమతో కార్యక్రమాలను నిర్వహించిన దాఖలాలు లేవు. పలువురు నేతలు వారి వారి ప్రాంతాల్లో రోడ్డుపైకి వచ్చి ఫొటోలకు ఫోజులిచ్చి రాస్తారోకో కార్యక్రమాలను 'మమ' అనిపించారు. శనివారం తెల్లవారుజామునే చంద్రబాబును అరెస్ట్ చేశారనే విషయం జిల్లా అంతటా వ్యాపించడంతో ఎక్కడ ఆందోళనలు జరుగుతాయోనని, ఆర్థికంగా నష్టం వాటిల్లుతుందేమోననే ముందు జాగ్రత్తలో భాగంగా ఆర్‌టీసీ అధికారులు బస్సులను ఎక్కడికక్కడ నిలిపేశారు. బస్సులను ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిలిపి వేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పలు నియోజకవర్గ కేంద్రాలు, మండలాల్లో పట్టుమని పది నిమిషాలు కూడా నిరసనలు వ్యక్తం చేయని పరిస్థితి నెలకొంది.

➤ నంద్యాలలో చంద్రబాబును అరెస్ట్ చేసే సమయంలో అక్కడే ఉన్న ఆ జిల్లాకు చెందిన పలువురు మాజీ ఎమ్మెల్యేలను బండిఆత్మకూరు పోలీసులు అదుపులోకి తీసుకొని వదలి పెట్టిన అనంతరం వారు బయటకు వచ్చి రోడ్డుపై కొంత సేపు రాస్తారోకో నిర్వహించారు.

➤ మాజీ మంత్రి భూమా అఖిలప్రియను కూడా నంద్యాల నుంచి మహానంది పోలీస్‌స్టేషన్‌కు తరలించి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

➤ ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని చాగలమర్రిలో పలువురు టీడీపీ నేతలు కొద్దిసేపు నిరసన వ్యక్తం చేయగా, మిగిలిన మండలాల్లో తెలుగుదేశం నేతలు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదు.

➤ బనగానపల్లె నియోజకవర్గంలో ఎక్కడ కూడా చంద్రబాబు అరెస్ట్‌కు నిరసన తెలుపకపోవడం గమనార్హం.

➤ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి తన నివాసం ముందు కొద్దిసేపు మాత్రమే నిరసన వ్యక్తం చేశారు.



టీడీపీ నేతల నిరసనతో కర్నూలు నగరంలో వాహనదారుల ఇక్కట్లు

➤ శ్రీశైలం నియోజకవర్గానికి సంబంధించి ఆత్మకూరులో కొందరు ద్వితీయశ్రేణి నేతలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలపగా, వెలుగోడు మండలంలో ఎలాంటి కార్యాక్రమాలు నిర్వహించ లేదు.

➤ నియోజకవర్గ కేంద్రమైన నందికొట్కూరు మినహా పగిడ్యాల, జూపాడుబంగ్లా, మిడ్తూరు, పాములపాడు మండలాల్లో టీడీపీ నేతలు మౌనం వహించారు. ఆయా మండలాలకు చెందిన ఒకరిద్దరు నేతలు నందికొట్కూరులో నిర్వహించిన కార్యక్రమంలో కలిసిపోయారు.

➤ నియోజవర్గ కేంద్రమైన కోడుమూరులో రాస్తారోకో చేస్తున్న తమ్ముళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

➤ జిల్లా కేంద్రమైన కర్నూలులో పార్టీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేయడంతో ప్రధాన రహదారిపై వెళ్లే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

అరెస్టు సమంజసమే



చట్టాలను గౌరవిస్తానని చంద్రబాబు చెబుతున్నారు. అందుకు కట్టుబడి ఈ కేసును న్యాయపరంగా ఎదుర్కోవాలి. ఆధారాలతో సీఐడీ అధికారులు అరెస్టు చేయడం సమంజసమే. తప్పు చేయలేదన్నప్పుడు నిరూపించుకునేందుకు న్యాయస్థానాలు ఉన్నాయి. చట్టాలను, వ్యవస్థలను కించపరిచి మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు.

– వై.రామిరెడ్డి, సీనియర్ న్యాయవాది, ఆదోని

ప్రజాధనాన్ని లూటీ చేస్తే ఊరుకోవాలా?



అధికారాన్ని, పదవులను అడ్డు పెట్టుకొని ఇష్టారాజ్యంగా ప్రజాధనాన్ని లూటీ చేస్తే ఊరుకోవాలా? చంద్రబాబును అరెస్ట్ చేయడంలో తప్పు లేదు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ సీఐడీ పోలీసులు బాధ్యతగా భావించారు.– మాబాషా, ఆదోని

చంద్రబాబు పాపం పండింది

కర్నూలు(సెంట్రల్): టీడీపీ అధినేత చంద్రబాబు పాపం పండి స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అరెస్టు అయ్యారని వైఎస్‌ఆర్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు బీవై రామయ్య, కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. తప్పులు చేస్తూ పోయేవారు ఎల్లకాలం తప్పించుకోలేరన్నారు. శనివారం ఉదయం పక్కా ఆధారాలతో సీఐడీ పోలీసులు అరెస్టు చేశారని, ఇందులో తమ పార్టీకి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎలాంటి ప్రమేయం లేదన్నారు. అరెస్టు సమయంలో చంద్రబాబు వ్యవహరించిన తీరు అభ్యంతరకరంగా ఉందని తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముందుగా కర్నూలు జిల్లా అధ్యక్షుడు, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడారు. చంద్రబాబునాయుడు పాలనా కాలంలో 2014–19 మధ్య అనేక కుంభకోణాలు జరిగాయన్నారు. వీటిలో స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో సీఐడీ పోలీసులు చంద్రబాబును అరెస్టు చేశారన్నారు. ఈ కేసులో ఇప్పటి వరకు దాదాపు 8 మందిని అదుపులోకి తీసుకున్నారన్నారు. తప్పు చేస్తే ఎవరినైనా అరెస్టు చేస్తారని, అసలు అరెస్టు చేయకూడదని టీడీపీ రాద్ధాంతరం చేయడం అన్యాయమన్నారు.



మాట్లాడుతున్న రామయ్య, చిత్రంలో కాటసాని

అవినీతి డబ్బుతోనే ఎమ్మెల్యేల కొనుగోలు

నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్థిక కేసుల్లో ముందస్తుగా నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేయవచ్చన్నారు. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబునాయుడు పలు కుంభకోణాలు చేసి వచ్చిన డబ్బుతో అప్పట్లో వైఎస్సార్‌సీపీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలను, ముగ్గురు ఎంపీలను కొనుగోలు చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మద్దయ్య మాట్లాడుతూ.. పక్కా ఆధారాలతో చంద్రబాబును అరెస్టు చేస్తే ఉలుకెందుకన్నారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సు భాష్‌చంద్రబోస్, పార్టీ మహిళా విభాగం రీజినల్ ఇన్‌చార్జ్ శ్వేతారెడ్డి, నాయకులు నల్లబోలు గోపాలు రెడ్డి, ధనుంజయాచారి, డీకే రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ ఆత్మ శాంతించింది



చంద్రబాబునాయుడిని అరెస్టు చేయడంతో నందమూరి తారక రామారావు ఆత్మశాంతించి ఉంటుంది. రెండు ఎకరాల నుంచి రెండు లక్షల కోట్ల ఆస్తులు చంద్రబాబు సంపాదించారు. చంద్రబాబు శిశుపాలుడిలా 101 తప్పులు చేయడంతో అరెస్టు తప్పలేదు. ప్రజా సొమ్మును దోచుకుంటే అరెస్టు చేయకుండా ఉంటారా? చంద్రబాబు నాయుడిపై పూర్తి స్థాయి విచారణ జరిపి అవినీతి సొమ్మును కక్కించాలి.

– గుమ్మనూరు జయరాం, కార్మిక, ఉపాధి కల్పనా శాఖ మంత్రి

తప్పు చేస్తే జైలుకు వెళ్తారు



చంద్రబాబు నాయుడి అరెస్టుతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదు. ఈ కేసు 2022 నుంచి విచారణలో ఉంది. పక్కా ఆధారాలతోనే అరెస్టు చేశారు. సానుభూతి కోసం టీడీపీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారు. తప్పు చేస్తే ఎవరినైనా చట్ట ప్రకారం శిక్షిస్తారు. సాకులు వెతకకుండా చంద్రబాబు విచారణకు సహకరించాలి. తప్పులు చేయకపోతే నిజం బయటకు వస్తుంది. తప్పు చేస్తే జైలుకు వెళ్తారు.

– కంగాటి శ్రీదేవి, ఎమ్మెల్యే, పత్తికొండ

26 కేసుల్లో స్టేలు తెచ్చుకున్నారు



తప్పు చేసినా దొరక్కకుండా చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్ చేస్తూ వస్తున్నారు. ఇప్పటికే ఆయన 26 కేసుల్లో స్టేలు తెచ్చుకున్నారు. ఎవరూ ఏమీ చేయలేరన్న ధీమాతో ఉన్నారు. కేంద్ర ఐటీ, ఈడీ శాఖల నివేదిక ప్రకారమే స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. రెండేళ్లపాటు విచారణ చేసిన సీఐడీ పక్కా ఆధారాలతోనే అరెస్టు చేసింది. చంద్రబాబు అక్రమాలకు స్కిల్ స్కాం మచ్చుతునక. ఇంకా అనేక స్కాంలు ఉన్నాయి. అవన్నీ కూడా ఒక్కొక్కటీ బయటకు వస్తాయి.

– చెన్నకేశవరెడ్డి, ఎమ్మెల్యే, ఎమ్మిగనూరు

నిజాయితీ నిరూపించుకోవాలి



చంద్రబాబు నాయుడు ఆత్మసాక్షిగా రూ.371 కోట్ల అవినీతి చేశారా లేదో చెప్పాలి. తప్పు చేస్తే ఎవరినైనా చట్ట ప్రకారం అరెస్టు చేస్తారు. ఇందులో ప్రభుత్వ పాత్ర ఏమీ ఉండదు. చట్టం తన పని తాను చేసుకుంటుంది. అవినీతి, అక్రమాలు చేశారని అరెస్టు చేస్తే టీడీపీ అనవసర రాద్ధాంతం చేస్తోంది. చట్టానికి ఎవరూ అతీతులు కాదు. చంద్రబాబు నిజాయితీని నిరూపించుకోవాలి. అంతవరకు ఆయన ఆర్థిక నేరగాడే!

– జి. సుధాకర్, ఎమ్మెల్యే, కోడుమూరు

● పవనపుత్రా..పాహిమాం!



శ్రావణమాసం నాలుగో శనివారం సందర్భంగా ఆదోని పట్టణంలో భారీ భక్తజన సందోహం మధ్య హనుమాన్ రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉత్సవమూర్తికి హారతి ఇస్తున్న పూజారి

సత్వర న్యాయమే లోక్ అదాలత్ లక్ష్యం

● జిల్లా జడ్జి ఎన్.శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్): కక్షిదారులకు సత్వర న్యాయం అందించాలన్న లక్ష్యంతో సుప్రీం కోర్టు లోక్ అదాలత్ చట్టం తెచ్చిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. గతంలో జాతీయ లోక్ అదాలత్‌లు పలు దఫాలు నిర్వహించేవారని, ప్రస్తుతం మార్పులు చేసి సంవత్సరంలో నాలుగుసార్లు నిర్వహిస్తున్నారన్నారు. రాజీ కాగల క్రిమినల్ , అన్ని రకాల సివిల్ , రోడ్డు ప్రమాద, ప్రీలిటిగేషన్ బ్యాంకు కేసులు పరిష్కారం చేస్తున్నారన్నారు. లోక్ అదాలత్ ఉద్దేశాలను మహిళా కోర్టు న్యాయమూర్తి జి.భూపాల్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి పి.పాండురంగారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.నాగభూషణం నాయుడు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సి.హెచ్.నాగ వెంకటశ్రీనివాసరావు వివరించారు. న్యాయమూర్తులు పి.దివాకర్, బాబా ఫక్రుద్దీన్, టి.జ్యోత్స్నదేవి, కళ్యాణి, జూనియర్, సీనియర్ న్యాయవాదులు, ఇన్సూరెన్స్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లాజడ్జి శ్రీనివాసరావు

20,667 కేసుల పరిష్కారం

జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 20,667 కేసులు పరిష్కారం అయినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్‌వీఎస్ శ్రీనివాసరావు తెలిపారు. కర్నూలులో అత్యధికంగా 15 వేలకు పైగా కేసులను న్యాయమూర్తులు పరిష్కారం చేశారు. మోటారు వాహన ప్రమాద కేసులను జిల్లా 7వ అదనపు న్యాయస్థానం న్యాయమూర్తి జి.భూపాల్ రెడ్డి , సివిల్ కేసులను ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి పి.పాండురంగారెడి, రాజీ కాగల క్రిమినల్, చెక్‌బౌన్స్ కేసులను జూనియర్ సివిల్ జడ్జీలు టి.జ్యోత్స్నదేవి, పఠాన్ షియాజ్‌ఖాన్, కళ్యాణి పరిష్కరించారు.

రాష్ట్రంలో ప్రథమం

రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం జరిగి కర్నూలు ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.శ్రీనివాసరావు చొరవ తీసుకుని న్యాయమూర్తులు, పోలీసు శాఖలను సమన్వయం చేసి ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేశారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని మహిళ ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

ఆదోని సెంట్రల్: కోసిగి-ఐరన్‌గల్ రైల్వే లైన్ మధ్యలోరైలు కింద పడి గుర్తు తెలియని మహిళ శనివారం ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి వయస్సు 35 సంవత్సరాలు ఉంటుంది. ఆమె నీలం రంగు పూల డిజైన్ కలిగిన చీర ధరించి ఉంది. ఆదోని డిప్యూటీ ఎస్ఎంఆర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ రామస్వామి తెలిపారు. మృతురాలిని గుర్తుపట్టిన వారు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

వివాహం కాలేదని..



మృతి చెందిన కురువ నాగార్జున

మిడుతూరు: వివాహం కాలేదని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తలముడిపి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చిన్నయ్య, మద్దమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. చిన్న కుమారుడైన కురువ నాగార్జున(25) వ్యవసాయం చేసేవాడు. కాగా వివాహం చేసుకునేందుకు సంబంధాలు కుదరక పోవడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బయ్య తెలిపారు.

త్వరలో అండర్ -19 ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

- జిల్లా వృత్తి విద్యాధికారి జమీర్



మాట్లాడుతున్న జమీర్

కర్నూలు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలో అండర్ -19 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా వృత్తి విద్యాధికారి(డీవీఈఓ) జమీర్ తెలిపారు. శనివారం స్థానిక జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి కార్యాలయంలో అన్ని కళాశాలల వ్యాయామ అధ్యాపకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీవీఈఓ మాట్లాడుతూ.. 2023-24 విద్యా సంవత్సరంలో స్కూల్‌గేమ్స్ పోటీల్లో పాల్గొనే విద్యార్థినీ, విద్యార్థులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. క్రీడా సమాఖ్య షెడ్యూల్ ప్రకారం జిల్లా స్థాయి ఎంపిక పోటీలను కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్, బేస్‌బాల్, జూడో, ఫెన్సింగ్, సెపకతక్రా, యోగా, చెస్, ఆర్చరీ, రైఫిల్ షూటింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, కరాటే, రోప్ స్కిప్పింగ్ వంటి క్రీడాంశాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంపికయిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. కార్యక్రమంలో అండర్-19 ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పద్మావతి పాల్గొన్నారు.



యోగాసనంలో..



పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు



పోటీలను పర్యవేక్షిస్తున్న న్యాయనిర్ణేతలు

యోగాతో ఆరోగ్యభాగ్యం

- రాష్ట్రస్థాయి యోగాసన పోటీలను ప్రారంభించిన మేయర్ రామయ్య



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చిత్రంలో మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్): ఆరోగ్య జీవనానికి యోగా సాధన ఏకైక మార్గమని కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. స్థానిక జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో శనివారం 48వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్, సీనియర్ పోటీలను జ్యోతి ప్రజ్వలనతో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ.. ప్రతి రోజూ 200 మందికి ఉచితంగా యోగా నేర్పిస్తూ రాష్ట్ర యోగా సంఘం చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా సాధన చేయాలన్నారు. క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలన్నారు. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ మాట్లాడుతూ కర్నూలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో యోగా అభివృద్ధి కోసం పార్కులను కేటాయిస్తున్నామన్నారు. యోగా సంఘం ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. యోగా సంఘం చైర్మన్ లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ.. 11 జిల్లాల నుంచి 500 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో అవుకు జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ, స్పోర్ట్స్ అథారిటీ మాజీ యోగా డైరెక్టర్ రవీంద్రనాథ్, జిల్లా క్రీడాశాఖ సీఈఓ రమణ, కార్పొరేటర్ శ్వేతారెడ్డి, ఒలింపిక్ సంఘం సీఈఓ విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయ మండలి సలహా చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి పాల్గొన్నారు.

లబ్ధిదారులందరూ ఇళ్లు నిర్మించుకోవాలి



పట్టాలను పంపిణీ చేస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా రవి తదితరులు

నంద్యాల: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాలు పొందిన ప్రతి ఒక్కరూ గృహాలు నిర్మించుకుని సొంత ఇంటి కల నెరవేర్చుకోవాలని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజల నిరంతర సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు పరుస్తోందన్నారు. ఇందులో భాగంగానే అర్హులైన ప్రతి పేదవాని సొంత ఇంటి కల నెరవేర్చాలన్న ప్రధాన ఉద్దేశంతోనే ఇంటిపట్టాతో పాటు గృహాన్ని కూడా నిర్మించి ఇస్తోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో పేదలందరికీ ఇళ్ల పట్టాల పంపిణీ చేయడంతో పాటు నివసించే కాలనీకి జగనన్న కాలనీగా నామకరణం చేస్తున్నామన్నారు. పేదలు నిర్మించుకునే ప్రతి ఇంటికి ప్రభుత్వం రూ.1,80,000 ఉచితంగా అందజేస్తుందన్నారు. అలాగే కాలనీలో తాగునీటి వసతి, డ్రైనేజీ కాలువలు, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల సొంత ఇంటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తోందన్నారు. ఇందులో భాగంగా నంద్యాల పట్టణంలోని నూనెపల్లి హరిజనవాడ, విజయపురి కాలనీ, మూలసాగరం, షాదిక్ నగర్ తదితర ప్రాంతాల్లోని అర్హులైన 255 మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న బొమ్మలసత్రం నుంచి నూనెపల్లె వరకు రోడ్డుకిరువైపులా ఉన్న పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ సంబంధించిన పనులను వేగంగా పూర్తి చేసి పంపిణీ చేస్తున్నామన్నారు. నంద్యాల జిల్లా అయిన తర్వాత వేగంగా అభివృద్ధి చెందుతోందని కొత్త కొత్త పరిశ్రమలు కూడా జిల్లాలో నెలకొల్పడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారన్నారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు ఇంటి పట్టాలను మంజూరు చేశారు. కార్యక్రమంలో దృశ్య కళల డైరెక్టర్ సునిత అమృతరాజ్, నంద్యాల మున్సిపల్ కమిషనర్ రవి చంద్ర రెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

చేతి వృత్తులకు 'విశ్వకర్మ' చేయూత

- బ్యాంకుల ద్వారా రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు రుణాలు
- వివరాలు వెల్లడించిన డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ నాగశివలీల

కర్నూలు(అగ్రికల్చర్): కులవృత్తులు, చేతి వృత్తులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనను అమలు చేస్తోందని డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ నాగశివలీల శనివారం విలేకరులకు తెలిపారు. ఈ పథకం కింద ఎంపికైన వారికి 15 రోజుల పాటు శిక్షణ ఇస్తారని, శిక్షణ కాలంలో రోజుకు రూ.500 ప్రకారం స్టైపండ్ చెల్లిస్తారని పేర్కొన్నారు. 18 ఏళ్ల కంటే ఎక్కువ వయస్సు కలిగి, వారి పూర్వీకుల నుంచి వృత్తిని స్వీకరించిన వారు పీఎం విశ్వకర్మ పథకానికి రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అర్హులవుతారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం క్రెడిట్ ఆధారిత పథకాల కింద రుణాలు పొంది ఉండకూడదని, అయితే రుణాలను తిరిగి చెల్లించిన వారు ఈ పథకానికి అర్హులవుతారని చెప్పారు. కుటుంబంలో ఒక్కరికి మాత్రమే ఈ పథకం అమలవుతుందని, ఆ కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉండకూడదని తెలిపారు. వడ్రంగి, పడవల తయారీ, కమ్మరి, స్వర్ణకారులు, కుమ్మరి, శిల్పకారులు, చర్మకారులు, చెప్పులు కుట్టేవారు, తాపీ పనిచేసేవారు, బుట్ట/చాప/ చీపుర్లు నేసేవారు, బొమ్మల తయారీదారులు, బొమ్మల తయారీ సాంప్రదాయం కలిగినవారు, క్షురకులు, దుస్తులు ఉతికేవారు, చేపల వల తయారు చేసేవారు ఈ పథకం కింద ప్రయోజనం పొందవచ్చని పీడీ వివరించారు. ఈ పథకం కింద రూ.15వేల విలువ కలిగిన టూల్‌కిట్ ఇస్తారని తెలిపారు. వ్యాపార అభివృద్ధికి మొదటి విడతలో రూ.లక్ష రుణ సదుపాయం ఉంటుందని, దీనిని 18 నెలల్లో చెల్లించాలన్నారు. రెండో విడతలో రూ.2లక్షల వరకు రుణం ఇస్తారని, దీనిని 30 నెలల్లో చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ రుణంపై ఏడాదికి 5 శాతం వడ్డీ వసూలు చేస్తారని, రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఐడీ కార్డు, సర్టిఫికెట్ కూడా ఇస్తారన్నారు.

అవమానంతోనే అంతమొందించేందుకు కుట్ర

- మహిళ కిడ్నాప్‌యత్నం కేసులో మరో నలుగురి నిందితుల అరెస్ట్

కోవెలకుంట్ల: చెప్పుతో కొట్టి అవమానించిందన్న కోపంతోనే పరిచయం ఉన్న మహిళను కిడ్నాప్ చేసి హత్య చేసేందుకు కుట్ర పన్నిన నిందితులు పోలీసుల నిఘాతో దొరికిపోయారు. నాలుగు రోజుల క్రితం ఇద్దరు పట్టుబడగా శనివారం మరో నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. కోవెలకుంట్ల సీఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన లక్ష్మీనరసమ్మ, ఇదే మండలం భీమునిపాడుకు చెందిన రవి బనగానపల్లె పట్టణంలోని వీ-మార్ట్ మాల్‌లో పనిచేస్తున్నారు. ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడి పెళ్లి చేసుకోవాలనుకున్నారు. లక్ష్మీనరసమ్మ భర్తకు దూరంగా ఉన్నా ఇద్దరు పిల్లలు ఆమె వద్దనే ఉన్నారు. పిల్లలను వదిలేసి వస్తేనే పెళ్లి చేసుకుంటానని రవి చెప్పడంతో ఆమె నిరాకరించింది. దీంతో ఆరు నెలల నుంచి ఇద్దరి మధ్య మనస్పర్థలు చోటు చేసుకున్నాయి. 12 రోజుల క్రితం బనగానపల్లె పట్టణంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా లక్ష్మీనరసమ్మ రవిని చెప్పుతో కొట్టింది. దీన్ని అవమానంగా భావించిన రవి ఆమెను హత్యచేసేందుకు పథకం రూపొందించాడు. మండలంలోని సొదరదిన్నె గ్రామానికి చెందిన బంధువు శేఖర్‌కు విషయం తెలియజేశాడు. దీంతో శేఖర్‌కు పరిచయం ఉన్న నంద్యాలకు చెందిన హర్ష, బండిఆత్మకూరుకు చెందిన ధ్రువకుమార్, గోస్పాడు మండలం తేళ్లపురికి చెందిన నరసింహ, పుల్లయ్యతో కలిసి రవి బుధవారం కారులో కోవెలకుంట్లకు చేరుకున్నాడు. షాపు నుంచి రాత్రి తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో కిడ్నాప్ చేసి హత్య చేసేందుకు రెక్కీ నిర్వహించారు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం తిరుగుతుండటంతో పోలీసులు గుర్తించి కుట్రను భగ్నం చేశారు. అదే రోజు నిందితులు ధ్రువకుమార్, నరసింహను అరెస్ట్ చేశారు. మిగిలిన నిందితుల కోసం ఎస్ఐ మౌలానీ ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి రెండు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. నంద్యాల పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న రవి, శేఖర్, పుల్లయ్య, హర్షను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరుచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ వివరించారు.

11వ రోజు 397 మంది ఎంపిక

- కొనసాగుతున్న ఎస్ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు



దేహదారుఢ్య పరీక్షలలో పాల్గొన్న ఎస్ఐ అభ్యర్థులతో మాట్లాడుతున్న పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ అతుల్‌సింగ్

కర్నూలు: పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా రాయలసీమ జోన్‌కు సంబంధించి ఎస్ఐ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కర్నూలు ఏపీఎస్పీ రెండవ బెటాలియన్‌లో 11వ రోజు దేహదారుఢ్య పరీక్షలు జరిగాయి. శనివారం జరిగిన దేహదారుఢ్య పరీక్షలకు 800 మంది అభ్యర్థులను ఆహ్వానించగా 570 మంది హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తర్వాత బయోమెట్రిక్, ఎత్తు, ఛాతీ కొలతలు నిర్వహించారు. అనంతరం ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులు 1600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ పరీక్షలు నిర్వహించారు. వివిధ అంశాల్లో ప్రతిభను కనపరచి 397 మంది తుది రాత (మెయిన్స్) పరీక్షకు అర్హత సాధించారు.

దేహదారుఢ్య పరీక్షలను పరిశీలించిన పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్

కర్నూలు ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో జరుగుతున్న ఎస్ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలను ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ అతుల్ సింగ్ పరిశీలించారు. డీఐజీ సెంథిల్‌కుమార్, ఏపీఎస్పీ బెటాలియన్స్ డీఐజీ వెంకటేశ్వర్లు, ఎస్పీ కృష్ణకాంత్, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ తదితరులు అడిషనల్ డీజీ అతుల్ సింగ్ వెంట ఉన్నారు. ఈ సందర్భంగా పోలీసు ఉన్నతాధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బాగా పనిచేయాలని సూచించారు. బయోమెట్రిక్, ఎత్తు, బరువు, ఛాతీ కొలతల పరికరాలను కంప్యూటర్‌లో సర్టిఫికెట్స్ అప్‌లోడ్ స్కానర్లు, వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అభ్యర్థులను నిర్వహించిన ఈవెంట్స్‌ను పరిశీలించారు. దేహదారుఢ్య, శారీరక సామర్థ్య పరీక్షల్లో పాల్గొన్న అభ్యర్థులతో అతుల్‌సింగ్ నేరుగా కొద్దిసేపు మాట్లాడారు. ప్రతిభను కనపరచి అందరూ అర్హత సాధించి ఎస్ఐ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగబాబు, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

కళా రూపాలతో సమాజ చైతన్యం

- రంగం రాష్ట్ర ప్రథమ మహాసభల్లో జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ రెడ్డి



మాట్లాడుతున్న జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి

కర్నూలు కల్చరల్: సమాజ చైతన్యానికి కళా రూపాలు దోహదపడతాయని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి అన్నారు. సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న రంగం ప్రజా సాంస్కృతిక వేదిక రాష్ట్ర ప్రథమ మహాసభలను శనివారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి హాజరైన రంగం సభ్యులు, కళాకారులు భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకొని వివిధ కళా రూపాల ద్వారా సమాజంలోని రుగ్మతలను తొలగించాలన్నారు. సోషల్ మీడియా ప్రభావంతో చెడు వ్యసనాలకు లోనై యువత జీవితాలను నాశనం చేసుకుంటుందని, దీన్ని నివారిల్సించాల్సి బాధ్యత కళాకారులపై ఉందన్నారు. భాషా సంస్కృతులను రక్షించుకొని భావి తరాలకు అందించాలన్నారు. అంతకు ముందు రంగం పతాకావిష్కరణతో సభను ప్రారంభించారు. కళాకారులు నగరంలో కళా ప్రదర్శనలు నిర్వహించారు. రంగం రాష్ట్ర అధ్యక్షులు అనంత కరుణాకర్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, మైపర్ విద్యా సంస్థల అధినేత ఆదిమూలపు సతీష్, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, రంగం రాష్ట్ర కార్యదర్శి రాజేష్, జిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్న కేంద్రం

- ఏఐఐఈఏ జాతీయ ఉపాధ్యక్షులు సతీష్



మాట్లాడుతున్న పీ సతీష్

కర్నూలు(అర్బన్): కేంద్ర ప్రభుత్వం సొంత నిర్ణయాలు తీసుకుంటూ స్వయంప్రతిపత్తి గల ఎల్‌ఐసీ సామాజిక లక్ష్యానికి, సేవా మార్గానికి తూట్లు పొడుస్తోందని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు పీ సతీష్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో కడప డివిజన్ పరిధిలోని ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ఎల్‌ఐసీ ఉద్యోగులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సునీయకుమార్, సంయుక్త కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణ తరగతులకు ఎస్‌ఈజెడ్‌ఐఈఎఫ్ జాతీయ సంయుక్త కార్యదర్శి జీ తిరుపతయ్య, ఏ రఘునాథ రెడ్డి, అక్బర్‌బాషా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవలి కాలంలో ఎల్‌ఐసీకి సంబంధించిన 3.5 శాతం షేర్లను అమ్మగా వచ్చిన రూ.21 వేల కోట్లను కేంద్రం తన ఖాతాలో వేసుకుందన్నారు. పాలసీ పోర్టబులిటీ, ఏజెంట్స్ పోర్టబులిటీ తదితర అంశాలను తెరపైకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టిందన్నారు. బీమా రంగం పెట్టుబడులను స్టాక్‌మార్కెట్‌లో పెట్టడం వల్ల సామాజిక లక్ష్యం, సేవా మార్గాలు పక్కదారి పట్టనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పలు నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం ఉప సంహరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు, ఉద్యోగుల బాధ్యతపై శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జోనల్ నాయకులు విజయకుమార్, రాజు, అయ్యవారిరెడ్డి పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల: బెలుం – కొలిమిగుండ్ల రహదారిలో గ్యాస్ గోడౌన్ వద్ద బైక్ అదుపు తప్పి కింద పడిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. బెలుంకు చెందిన చాకలి సుబ్బరాయుడు(47) నాపరాతి గనులతో పాటు టిప్పర్లు నిర్వహిస్తున్నాడు. ఉమ్మాయిపల్లెకు చెందిన వ్యక్తి నాపరాతి గనికి చెందిన డబ్బులు బకాయి ఉండటంతో వసూలుకు శుక్రవారం రాత్రి సోదరుడు సుబ్బరావుతో కలిసి బైక్‌లో వెళ్లారు. తిరుగుప్రయాణంలో స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో గ్యాస్ గోడౌన్ వద్ద అదుపు తప్పి కింద పడటంతో సుబ్బరాయుడు గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు తాడిపత్రి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో వైద్యుల సూచన మేరకు శనివారం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికి మృతి చెందాడు. పోలీసులు ప్రమాద వివరాలు సేకరించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సాక్షి ఫ్యామిలీ
కర్నూలు
ఆదివారం ॥ 10-9-2023

వైరల్




గ్రీన్ సిగ్నల్

పట్టణాల్లోని చిన్న అపార్ట్‌మెంట్‌వాసుల నోటి నుంచి తరచుగా వినిపించే మాట 'మొక్కలు అంటే మాకు చాలా ఇష్టం. కాని స్థలం ఎక్కడిది?'

'స్థలం పెద్దగా అక్కర్లేదు. పెంచాలనే సంకల్పం ఉంటే చాలు' అంటుంది బిహార్‌కు చెందిన కమల్‌సింగ్.

ఉద్యోగ నిమిత్తం బెంగళూరులో ఉంటున్న కమల్‌సింగ్ తన చిన్న అపార్ట్‌మెంట్ బాల్కనీలో రకరకాల మొక్కలు పెంచుతుంది.

'వంటగది వ్యర్థాలతో కంపోస్ట్‌ను ఎలా తయారు చేయాలి?' అనే విషయం నుంచి ఏ మొక్కలను ఎలా పెంచాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి వరకు... ఎన్నో విషయాలను సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తోంది. ఆమె ఇన్‌స్టాగ్రామ్ పేజీ 'అర్బన్ హోమ్ వైబ్స్'కు ఎంతోమంది ఫాలోవర్స్ ఉన్నారు.

'స్టార్ట్ వేర్ యూ ఆర్ విత్ వాటెవర్ యూ హ్యావ్' అంటున్న కమల్‌సింగ్ స్ఫూర్తితో ఎంతో మంది పట్టణ వాసులు తమ బాల్కనీలో మొక్కల పెంపకానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి 'మేము సైతం' అంటున్నారు.


మలాలాతో మహ్నూర్

బహుముఖ ప్రజ్ఞాశాలి

పదహారు సంవత్సరాల బ్రిటీష్-పాకిస్థానీ మహ్నూర్ ఛీమ లండన్‌లోని జనరల్ సర్టిఫికెట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (జీసీఎస్‌ఈ) లెవెల్‌లో 34 సబ్జెక్‌లలో టాప్ గ్రేడ్ సాధించి రికార్డ్ సృష్టించింది. గణిత శాస్త్రం, ఖగోళశాస్త్రంలాంటి శాస్త్రాలు, ఫ్రెంచ్, లాటిన్... మొదలైన భాషలలో అద్భుతమైన ప్రతిభ చూపుతుంది మహ్నూర్. ఆమె ఎంచుకున్న 34 సబ్జెక్టలలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, లిటరేచర్, ఫిల్మ్ స్టూడియోస్, సైకాలజీ... మొదలైన సబ్జెక్ట్‌లు ఉన్నాయి.

'ఇది మహ్నూర్‌కు మాత్రమే పరిమితమైన విజయం కాదు. ఈతరంలో ఎంతోమందికి స్ఫూర్తినిచ్చే విజయం' అని ట్వీట్ చేశారు పాక్ మాజీ ప్రధాని షెహబాజ్ షరీఫ్.

'వైద్యురాలిగా పదిమందికి సేవ చేయాలి' అనేది తన జీవిత ఆశయంగా చెబుతుంది మహ్నూర్.

ఇదిగో సారూ... నా మేక టికెటు



గ్రామీణ ప్రాంతాల్లో పెంపుడు జంతువులను కుటుంబసభ్యులుగా చూసుకుంటారు. పేర్లు పెట్టి ప్రేమగా పిలుచుకుంటారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఒక మహిళ మేకను పెంచుకుంటుంది. ఒకరోజు ఆమె వేరే ఊరికి పోవాల్సి వచ్చింది. మేకను ఇంట్లో ఒంటరిగా విడిచిపెట్టడం ఇష్టం లేక తనతో పాటు తీసుకెళ్లింది. విశేషం ఏమిటంటే మేకకు కూడా ట్రెన్ టికెట్ తీసుకుంది. ఐఏఎస్ అధికారి అవినాష్ శరణ్ ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో క్లిప్ వైరల్ అయింది.

'తన మేకకు కూడా టికెట్ తీసుకున్న విషయాన్ని టీటీయితో ఎంత గర్వంగా చెబుతుందో చూడండి' అని రాశారు అవినాష్.

ఇక వీడియో క్లిప్ విషయానికి వస్తే... టికెట్ చూపించమని ఆమెను టీటీయి అడుగుతాడు. 'ఇదిగో' అంటూ చూపిస్తుంది.

'నీ సంగతి సరే, మరి మేకకు టికెట్ తీసుకున్నావా?' అని సరదాగా అడుగుతాడు టీటీయి.

'అమ్మో...తీసుకోకుండా ఎలా ఉంటాను. ఇదిగో టిక్కెట్టు' అని చూపిస్తుంది.

'నేను తరచుగా రైల్లో ప్రయాణిస్తుంటాను. టికెట్ లేకుండా ట్రెన్‌లో ప్రయాణించి టీటీయికి దొరికి పోయేవారిని చాలామందిని చూస్తుంటాను. వారిని గుర్తు తెచ్చుకున్నప్పుడు ఈమె చాలా గొప్పగా అనిపిస్తుంది' అని ఒక యూజర్ స్పందించాడు.

కాలం కలిసి వస్తే డంప్‌యార్డ్ కూడా నందనవనం అవుతుంది!



కాలం కలిసే వస్తే... కంపు కొట్టే డంపు యార్డ్ కూడా కనుల విందు చేసే పార్క్ అవుతుంది. రాజస్థాన్‌లోని రాజ్‌గఢ్‌లో ఒక డంప్ యార్డ్ ఉండేది. దుర్వాసన వల్ల ఆ చుట్టుపక్కల నుంచి నడిచి వెళ్లాలంటే జనాలు జడుసుకునేవారు. అలాంటి చోటుకు ఇప్పుడు జనాలు వెదుక్కుంటు వస్తున్నారు. దీనికి కారణం ఈ డంప్‌యార్డ్‌ను మున్సిపాలిటీ సిబ్బంది అందమైన పార్క్‌గా తయారుచేయడమే.

వాటర్ ఫౌంటెన్‌లు, పచ్చటి గడ్డితో ఈ పార్క్ కనువిందు చేస్తోంది.

ఇండియన్ ఫారెస్ట్ ఆఫీసర్ సవిత దావియా ఈ క్లిప్‌ను ట్విట్టర్‌లో షేర్ చేశారు.

'ఎన్నో పట్టణాలలో ఎన్నో డంప్‌యార్డ్‌లు భయపెడుతున్నాయి. అవి కూడా ఇలాగే నందనవనంలా మారితే ఎంత బాగుంటుంది' అంటూ ఒక ఎక్స్ యూజర్ స్పందించాడు.

కథక్ నుంచి తీన్మార్ వరకు

బెల్జియన్ కంటెంట్ క్రియేటర్ ఈడీ పీపుల్ వివిధ ప్రాంతాలలో లోకల్స్‌తో కలిసి చేసే డ్యాన్స్ వీడియోలు ప్రపంచ వ్యాప్తంగా ఫేమ్ అయ్యాయి. ఏదైనా ప్రాంతానికి వెళ్లిన పీపుల్ స్థానికులను 'మీకు ఇష్టమైన డ్యాన్స్ ఏమిటి?' అని అడగడమే కాదు 'నాకు నేర్పించగలరా?' అని రిక్వెస్ట్ చేసి ఓపిగ్గా నేర్చుకుంటాడు.

అలా ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రాంతాలకు చెందిన డ్యాన్స్‌లను నేర్చుకుంటూ, స్థానికులతో పోటీ పడి డ్యాన్స్ చేస్తుంటాడు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటాయి.

తాజాగా మన దేశానికి సంబంధించి వివిధ ప్రాంతాలకు చెందిన డ్యాన్స్‌లు చేసి 'వారేవా' అనిపించుకున్నాడు.

'మీ డ్యాన్స్ చూస్తుంటే భారతీయ పౌరసత్వం ఇవ్వాలనిపిస్తుంది'

'మా దేశంలోని కొన్ని అద్భుతమై డ్యాన్స్‌లను మిస్ అయ్యారు. వాటిని కూడా చేస్తే బాగుంటుంది' అంటూ వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఈడీ పీపుల్ షేర్ చేసిన డ్యాన్స్ వీడియోలపై నెటిజనులు స్పందించారు.





అటు చూస్తే జవాన్ ఇటు చూస్తే ఆఫీస్...

అటు చూస్తే బాదం హల్వా ఇటు చూస్తే సేమ్యా ఇడ్లీ... అని శ్రీశ్రీ అన్నట్టుగా ఆ బెంగళూరు ఐ.టి ఉద్యోగికి కూడా సంకటం వచ్చింది. ఒకవైపు జవాన్ రిలీజ్. మరోవైపు సాఫ్ట్‌వేర్ డ్యూటీ. చివరకు అతను రెండూ చేశాడు. వైరల్ అయ్యాడు.

బెంగళూరులోనే ఇటువంటివి జరుగుతుంటాయి. మొన్నా మధ్య ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ర్యాపిడో బైక్ వెనుక కూచుని ఆఫీస్‌కు వెళుతూ ట్రాఫిక్‌లో చిక్కుకుపోతే బైక్ మీదే ల్యాప్‌టాప్ తెరిచి లాగిన్ అయ్యి డ్యూటీ మొదలెట్టేశాడు. భారీ ట్రాఫిక్ వల్ల క్యాబుల్లో ఎక్కగానే ల్యాప్‌టాప్‌లు తెరిచే వాళ్లూ అక్కడ ఎక్కువే. ఇప్పుడు ఒక ఉద్యోగి ఏకంగా సినిమా హాల్లోనే ల్యాప్‌టాప్ తెరిచాడు. ఏం చేస్తాడు మరి? షారూక్ ఖాన్ ఫ్యాన్. ఫస్ట్ డే ఫస్ట్ షో. సరిగ్గా ఆ టైమ్‌కే లాగిన్ అవ్వాలి. అందుకని థియేటర్‌లో ల్యాప్‌టాప్‌లో వేళ్లు టిక్కుటక్కుమంటుంటే కళ్లు సినిమాకు అంకితం అయ్యాయి. వెనుక కూచున్న ఒక వ్యక్తి ఇది ఫొటో తీసి ఇన్‌స్టాలో పెడితే లక్షల కొద్దీ వ్యూస్ వచ్చాయి. 'బెంగళూరులో ఇక పని చేయకుండా వదిలేసిన చోటు ఏదీ లేదు' అని కామెంట్లు చేస్తూ ఏడవలేక నవ్వుతున్నారు.



హెల్త్



చాలారకాల వైరల్ జ్వరాల్లాగే డెంగీ కూడా తనంతట తానే తగ్గిపోయే (సెల్ఫ్ లిమిటింగ్) వ్యాధి. అయితే కొంత మందిలో మాత్రం ప్లేట్‌లెట్లు ప్రమాద స్థాయి కంటే కిందికి పడిపోతాయి. అది మినహా చాలావరకు డెంగీ నుంచి దాదాపుగా అందరూ కోలుకుంటారు. పైగా ఇది వైరల్ జ్వరం కావడంతో కేవలం లక్షణాలకు మాత్రమే చికిత్స చేస్తూ... ప్లేట్‌లెట్ కౌంట్‌ను జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. ఇటీవల పెద్దసంఖ్యలో ఈ కేసులు వస్తున్న నేపథ్యంలో డెంగీపై అవగాహన కోసం ఈ కథనం.

డెంగీ నివారణ ఇలా...!



డెంగీలో రకాలు

డెంగీ రకాలను ఈ కింది విధంగా పేర్కొనవచ్చు. అవి... ఏ హెచ్చరికలూ లేకుండా వచ్చే డెంగీ (**డెంగీ విదవుట్ వార్నింగ్ సైన్స్**) ; కొన్ని హెచ్చరికలతో వచ్చే డెంగీ (**డెంగీ విత్ వార్నింగ్ సైన్స్**) ; తీవ్రమైన డెంగీ (**సివియర్ డెంగీ**)

లక్షణాలు

హెచ్చరికలు లేకుండా అకస్మాత్తుగా వచ్చే డెంగీ : డెంగీ ఎండెమిక్ ప్రాంతాల్లో... అంటే డెంగీ ఎక్కువగా వస్తున్న ప్రాంతంలో ఇది కనిపిస్తుంటుంది. వీళ్లలో జ్వరం, వికారం/వాంతులు, ఒళ్లు నొప్పులు, ఒంటి మీద ర్యాష్ వంటి లక్షణాలు కనిపిస్తాయి.

కొన్ని హెచ్చరికలతో కనిపించే డెంగీ : పైన చెప్పిన లక్షణాలతో పాటు పొట్ట నొప్పి, ఊపిరితిత్తుల చుట్టూ ఉండే ప్లూరా అనే పొరలో లేదా పొట్టలో నీరు చేరడం. కొందరిలో పొట్ట లోపలి పొరల్లో రక్తస్రావం అవుతుండటం, బాధితులు అస్థిమితంగా ఉండటం, రక్తపరీక్ష చేయించినప్పుడు ఎర్ర రక్త కణాలకూ, మొత్తం రక్తం పరిమాణానికి ఉన్న నిష్పత్తి కౌంట్ పెరగడంతో పాటు ప్లేట్‌లెట్స్ సంఖ్య పడిపోతుంది.

తీవ్రమైన డెంగీ (సివియర్ డెంగీ) కేసుల్లో : అంతర్గత అవయవాల్లో రక్తస్రావం కారణంగా బాధితుడు తీవ్రమైన షాక్‌కు గురవుతాడు. ఊపిరితిత్తుల్లో నీరు చేరి శ్వాసప్రక్రియకు అంతరాయం ఏర్పడుతుంది. తీవ్ర రక్తస్రావంతో బాధితుడు స్పృహకోల్పోవచ్చు లేదా పాక్షిక స్పృహలో ఉండవచ్చు. మల్టిపుల్ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తో కీలకమైన అవయవాలు పనిచేయకుండా పోవచ్చు.

నిర్ధారణ పరీక్షలు :

- సీబీపీ ప్రతి 24 గంటలకు ఒకసారి చేయాలి.
- నిర్ధారణ కోసం డెంగీ ఎన్‌ఎస్1 యాంటీజెన్ పరీక్ష అవసరం కావచ్చు.
- డెంగీ ఐజీఎమ్ అనే పరీక్ష కూడా చేయాలి. కొన్ని అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ రిపోర్టులు వచ్చేందుకు పట్టే సమయం కూడా ఎక్కువే కాబట్టి డాక్టర్లు అవి వచ్చే వరకు ఆగకుండా... లక్షణాలను బట్టి చికిత్స అందించడం ప్రారంభిస్తారు.
- పై పరీక్షలతో పాటు ఇప్పుడు ఐపీఎఫ్ (ఇమ్మెచ్యూర్ ప్లేట్‌లెట్ ఫ్రాక్షన్) అనే అత్యాధునిక పరీక్ష అందుబాటులో ఉంది. ఇది ప్లేట్‌లెట్లను ఎప్పుడు, ఎంత పరిమాణంలో ఎక్కించాలో తెలుసుకోవడంతో పాటు మరెన్నో అంశాలు తెలుసుకోడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

టీకా ఉందిగానీ...

ప్రస్తుతం డెంగీకి టీకా (వ్యాక్సిన్) అందుబాటులో ఉన్నప్పటికీ ఇది అందరూ తీసుకునే పరిస్థితి ప్రస్తుతానికి లేదు. గతంలో ఓసారి డెంగీకి గురైన వారికి మాత్రమే టీకా ఇవ్వాలి. ఎందుకంటే రెండోసారి వచ్చే డెంగీ రావడం రావడమే చాలా ప్రమాదకరంగా ఉండి ప్రాణాపాయమూ కల్పించవచ్చు. కాబట్టి ఆ పరిస్థితిని నివారించేందుకు ఒకసారి డెంగీ వచ్చినవారికి మాత్రమే టీకా ఇస్తారు.



డా॥ రవీంద్ర కుమార్
కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్ అండ్ డయాబెటాలజిస్ట్

డెంగీలో మరింత ప్రమాదకరమైన కొన్ని లక్షణాలివి...

- ప్లేట్ లెట్స్ తక్కువ కావడంతో అంతర్గత అవయవాలలోకి రక్తస్రావం అయ్యే ప్రమాదంతో పాటు ఒంట్లోకి నీరు చేరడం, సివియర్ డీహైడ్రేషన్‌కు గురికావడం జరగవచ్చు.
- కొందరిలో హీమోగ్లోబిన్ కాన్సంట్రేషన్ పెరుగుతుంది. హెమటోక్రిట్ పెరుగుతుంది. దీనివల్ల రక్తం గడ్డకట్టదు. రక్తపోటు పడిపోతుంది. లివర్ ఎన్‌లార్జ్ అయి, అది దెబ్బతినే ప్రమాదముంటుంది. గుండెస్పందనలు నిమిషానికి 60 కంటే తక్కువకు కూడా పడిపోవచ్చు. ఇలా గుండె స్పందనలు తగ్గినప్పుడు బాధితుల్ని ఇంటెన్సివ్ కేర్‌లో ఉంచాల్సి వస్తుంది. బ్లీడింగ్, ఫిట్స్ వల్ల మెదడు దెబ్బతినే ప్రమాదమూ ఏర్పడవచ్చు. వ్యాధినిరోధక వ్యవస్థ (ఇమ్యూన్ సిస్టమే) పూర్తిగా దెబ్బతినడానికీ అవకాశముంది.

నివారణ ఇలా...

అన్ని వ్యాధుల్లోలాగే డెంగీలోనూ చికిత్స కంటే నివారణ ఎంతో మేలు. డెంగీని కలిగించే టైగర్ దోమ పగటిపూటే కుడుతుంది. దీని సంతానోత్పత్తి మంచి నీటిలోనే. ఈ ప్రక్రియకు పదిరోజుల వ్యవధి పడుతుంది. కాబట్టి వారంలోని ఏదో ఒక రోజు ఇంటిలోని నీటిని పూర్తిగా ఖాళీ చేసి డ్రై డే గా పాటిస్తే, దీని జీవితచక్రానికి విఘాతం కలిగి ప్రత్యుత్పత్తికి అంతరాయం ఏర్పడుతుంది.

- ఇళ్ల మూలలూ, చీకటి, చల్లటి ప్రదేశాలే టైగర్ దోమల ఆవాసం. ఇల్లంతా వెలుతురు, సూర్యరశ్మి ధారాళంగా వచ్చేలా చూసుకోవడంతో పాటు, దోమలు రాకుండా తలుపులకు, కిటికీలకు మెష్ అమర్చుకుంటే...ఒక్క డెంగీ దోమలే కాకుండా...మలేరియా, ఇతర వ్యాధులకు గురి చేసే దోమల్నీ నివారించినట్లు అవుతుంది.
- టైగర్ దోమ పెద్దగా ఎత్తుకు ఎగరలేదు. అందువల్ల కాళ్లు పూర్తిగా కప్పి ఉంచే దుస్తులతో, ఫుల్‌స్లీవ్‌తో చాలావరకు రక్షణ కలుగుతుంది.
- నిల్వ నీటిలోనే దోమ గుడ్లు పెడ్తుంది కాబట్టి కొబ్బరి చిప్పలు, డ్రమ్ములు, బ్యారెల్స్, టైర్లు, కూలర్లు, పూలకుండీల కింద పెట్టే ప్లేట్లు మొదలైన వాటిల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. అలాగే వాడని డ్రమ్ముల్ని బోర్లించి ఉంచాలి.
- దోమలను తరిమివేసేందుకు మస్కిటో రిపలెంట్స్ వాడవచ్చు.

డెంగీ వస్తే ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు. కొందరిలో మినహాయించి అది అందరిలోనూ ప్రమాదకరం కాదు. కాకపోతే గర్భిణులు, చిన్నారులు, పెద్దవయసు వారికి డెంగీ సోకినప్పుడు అది తగ్గేవరకు జాగ్రత్తగా ఉండాల్సి ఉంటుంది.

చికిత్స...

డెంగీ అన్నది వైరస్ కారణంగా వచ్చేది కాబట్టి దీనికి నిర్దిష్టంగా మందులేమీ ఉండవు. అందువల్ల లక్షణాలకు మాత్రమే చికిత్స (సింప్టమాటిక్ ట్రీట్‌మెంట్) ఇస్తారు. అంటే... అవసరమైనప్పుడు రక్తనాళం ద్వారా ఐవీ ఫ్లూయిడ్స్ ఎక్కించడం, అవసరాన్ని బట్టి రక్తాన్ని, ప్లేట్‌లెట్స్‌ను, ప్లాస్మా ఎఫ్ఎఫ్‌పి (ఫ్రెష్ ఫ్రోజెన్ ప్లాస్మా) ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ ప్లేట్‌లెట్స్ కౌంట్ 20 వేల నుంచి 15 వేలు లేదా అంతకంటే తక్కువకు పడిపోతేనే ప్లేట్‌లెట్స్ ఎక్కించాలి.

పిన్‌వార్మ్ / థ్రెడ్ వార్మ్ ఇన్ఫెక్షన్ అంటే...?



కొందరు చిన్నారుల్లోని ప్రైవేట్ ప్రాంతాల్లో సన్నటి దారాల్లాంటి క్రిములు కనిపిస్తుంటాయి. మూత్ర ద్వారం నుంచి వస్తున్నట్లు కనిపించే ఇవి నిజానికి మల ద్వారం నుంచి వస్తుంటాయి. అవయవ నిర్మాణపరంగా (అనటామికల్‌గా) మూత్ర విసర్జన ప్రాంతం (యురెథ్రా)... మల ద్వారానికి దగ్గరగా ఉండటంవల్ల ఇవి మూత్ర ద్వారం నుంచి వస్తున్నట్లు అనిపిస్తుంటాయి. సన్నటి దారాల్లాంటి ఆకృతిని బట్టి వాటిని థ్రెడ్‌వార్మ్స్ లేదా పిన్‌వార్మ్స్ అంటారు. ఈ ఇన్ఫెక్షన్‌ను 'ఎంటిరోబియాసిస్' అని కూడా చెబుతారు.

యుక్తవయసుకు వచ్చిన (అడల్ట్) పిన్‌వార్మ్స్ పెద్ద పేగుల్లో నివాసముంటాయి. ప్రతి అడల్ట్ జీవి 10,000 గుడ్లు పెడుతుంది. రాత్రివేళల్లో ఆడ పిన్‌వార్మ్ పెద్దపేగు (కోలన్) నుంచి మలద్వారం (రెక్టమ్) ద్వారా బయటకు వచ్చి పిరుదుల ప్రాంతంలో గుడ్లను వదిలేస్తుంది. ఆ గుడ్లు పిరుదుల మీద, మలద్వారం పరిసరాల్ని అంటిపెట్టుకుని ఉంటాయి. కొన్ని గుడ్లు గాల్లోకి కూడా వ్యాపిస్తాయి. వాటి నుంచి బయటకు వచ్చిన లార్వాలు బయటకు పిరుదులు, మలద్వారం, మూత్రద్వారం దగ్గర తచ్చాడుతుంటాయి. దురద కారణంగా పిల్లలు అక్కడ గీరుకున్నప్పుడు అవి గోళ్లలోకి చేరుతాయి. అవే చేతుల్ని నోట్లో పెట్టుకున్నప్పుడు అవి కడుపులోంచి మళ్లీ పెద్ద పేగుల్లోకి చేరి... ఇలా జీవిత చక్రాన్ని కొనసాగిస్తుంటాయి. వాటి లైఫ్ సైకిల్ పూర్తి కావడానికి 4-6 వారాలు పడుతుంది.

వ్యాప్తి ఇలా...

పిల్లలు ఆడుకునే బొమ్మలు, బెడ్ షీట్స్, తువాళ్లూ, లోదుస్తులు, టాయిలెట్ సీట్స్ ద్వారా తేలిగ్గా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తాయి. మరీ చిన్నపిల్లల్లో వాడిన డయపర్స్‌ను పెద్దలు ముట్టుకున్న తర్వాత వేరే పిల్లలను పట్టుకున్నప్పుడు కూడా వ్యాప్తి చెందే అవకాశాలుంటాయి. అయితే ఈ పిన్‌వార్మ్ ఇన్ఫెక్షన్ పెంపుడు జంతువుల (పెట్స్) ద్వారా ఇతరులకు వ్యాపించదు.

నివారణ చర్యలివి...

- పిల్లలకు ప్రతిరోజూ రెండుపూటలా స్నానం చేయించాలి.
- పిల్లలు తరచూ చేతులు శుభ్రంగా కడుక్కునేలా తల్లిదండ్రులు అలవాటు చేయాలి. ముఖ్యంగా మలవిసర్జన తర్వాతా, మట్టిలో ఆడిన తర్వాత పిల్లలు శుభ్రంగా చేతులు కడుక్కునేలా చూడాలి.
- పిల్లల గోళ్లు ఎక్కువగా పెరగకుండా వాటిని ఎప్పటికప్పుడు కత్తిరిస్తుండాలి.
- పిల్లలు తమ గోళ్లు కొరక్కుండా చూడాలి. గోళ్లు కొరికే అలవాటు ఉంటే మాన్పించాలి.
- ఇంట్లో ఎవరికైనా పిన్‌వార్మ్ ఇన్ఫెస్టేషన్ ఉంటే వాళ్లతో పాటు మిగతావాళ్లూ చికిత్స తీసుకోవాలి. లేకపోతే ఇది తరచూ తిరగబెడుతుండే అవకాశాలు ఎక్కువ.

చికిత్స... మెబెండజోల్, ఆల్బెండజోల్, పైరెంటల్ పామోయేట్ అనే మందుల్ని తగిన కోర్సులుగా ఇవ్వడం ద్వారా దీన్ని పూర్తిగా నయం చేయవచ్చు.

పిల్లల్లో పొరబోయిందా? గొంతులో ఏదైనా ఇరుక్కుందా?



పిల్లలు తినే సమయంలో వారి గొంతులో ఏదైనా ఇరుక్కున్నపుడు పొర పోయిందని పెద్దలు అంటుంటారు. తిన్న ఆహారం కిందికి కదలడం కోసం తలపై తడుతుంటారు. కానీ గొంతులో ఇరుక్కున్న ఆహారంగానీ లేదా నాణెంలాంటి వస్తువుగానీ ఊపిరితిత్తుల్లోకి వెళ్లే వాయునాళంలోకి పోతే చాలా ప్రమాదం. ఇలా ఆహారం ఇరుక్కున్నా లేదా ఏదైనా వస్తువు గొంతులో ఇరుక్కున్నా హాస్పిటల్‌కు వెళ్లేలోపు ఈ కింద పేర్కొన్న సూచనలు పాటించాలి.

- పిల్లల నోరు బాగా తెరిపించి, నాలుక బాగా చాపేలా చేసి, గొంతులోకి వేళ్లుపోనిచ్చి చేతికి ఏదైనా తగులుతుందేమో చూడాలి. తగిలితే వెంటనే బయటకు తీసేయాలి.
- పిల్లాడి వెనక పెద్దలెవరైనా నిల్చుని, వారి రెండు చేతుల్నీ పొట్టచుట్టూ బిగించి, అకస్మాత్తుగా చేతుల్తో పట్టుబిగుస్తున్నట్లుగా కదిలించాలి. ఇది క్రమపద్ధతిలో (రిథమాటిక్‌గా) చేస్తుండాలి. దాంతో పొట్ట దగ్గర ఒత్తిడి పెరిగి, గొంతులో ఇరుక్కున్నది బయటకు రావచ్చు. దీన్ని హీమ్‌లిచ్ మెనోవర్ అంటారు.
- ఇదే గనక చాలా చిన్నపిల్లల్లో / పసిపాపల్లో చేయాల్సి వస్తే... పెద్దలు కుర్చీలో కూర్చుని, చిన్నారులు తలకిందులుగా ఉండేలా, వాళ్లను తమ కాళ్లపైన బోర్లా పడుకోబెట్టాలి. ఇలా పడుకోబెట్టాక, చిన్నారుల వీపుపై అకస్మాత్తుగా ఒత్తిడి కలిగేలా నొక్కాలి. ఇది ఎలా జరగాలంటే... చిన్నారుల నడుము నుంచి వారి రెండు భుజాల మధ్య ప్రాంతంలో మృదువుగా ఒత్తిడి కలిగేలా కదిలిస్తుండాలి. ఇది కూడా క్రమపద్ధతిలో (రిథమాటిక్‌గా) చేయాలి. ఒకవైపు పొట్ట మీద పెద్దల కాళ్ల ఒత్తిడీ, మరోవైపు వీపు మీద చేతుల ఒత్తిడి కారణంగా గొంతులో అడ్డు పడ్డ పదార్థం బయటకు వచ్చే అవకాశం ఉంది.
- ప్రథమ చికిత్సగా ఇవి చేస్తూ... వీలైనంత త్వరగా పిల్లల్ని హాస్పిటల్‌కు తరలించాలి. ఈ ప్రక్రియలతో గొంతులో ఇరుక్కున్నవి బయటకు వస్తే సరి. లేదంటే హాస్పిటల్‌లో అవసరాన్ని బట్టి ఎండోస్కోప్ వాడి, ఇరుక్కున్న పదార్థాన్ని డాక్టర్లు బయటకు తీస్తారు.